Mana Telangana Dt 27/10/17

# 'మెట్రో' వెరీ గుడ్.. ఎన్‌వివిఎస్‌రెడ్డిని ప్రశంసించిన 'మెట్రో మ్యాన్'



మన తెలంగాణ/సిటీబ్యూరో : మెట్రోరైల్ సృష్టికర్త డాక్టర్ ఇ.శ్రీధరన్ హైదరాబాద్ మెట్రోరైల్ భవన్‌ను గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా మెట్రోరైల్ ఎం.డి.ఎన్‌వివిఎస్‌రెడ్డితో సమావేశమైన ఆయన మెట్రో పురోగతిపై చర్చించారు. యువ అధికారిగా ఎన్‌వివిఎస్‌రెడ్డి సాధించిన విజయం పట్ల ఆయన అబ్బురపడ్డారు. గతంలో ఆయన కొంకణ్ రైల్వేలో పనిచేసిన తీరు అంకితభావానికి నిదర్శనమని ప్రశంసించారు. మెట్రోరైలు ప్రాజెక్ట్ విజయవంతంగా పూర్తయి, ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉండడం పట్ల ఆయన ఆనందాన్ని వ్యక్తం చేశారు. మొదటగా హైదరాబాద్‌లో రెండు కారిడార్లకు మాత్రమే సవివర ప్రాజెక్ట్ నివేదిక(డిపిఆర్)ను రూపొందించడం జరిగిందని అన్నారు. రెండు కారిడార్లకు మార్పులు, చేర్పులు చేయడం, మూడో కారిడార్‌ను చేర్చడంతో పాటు ప్రణాళికాయుతంగా ప్రస్తుత ఆకారానికి ఎలా తీసుకురావడం జరిగిందో ఎన్‌వివిఎస్‌రెడ్డి ఈ సందర్భంగా శ్రీధరన్‌కు వివరించారు. పట్టుదల, వ్యూహాత్మకమైన నిర్వహణ ద్వారా ఇది సాధ్యమైందన్నారు. 1980లో కొంకణ్ రైల్వేలో యువ అధికారిగా ఉన్నప్పుడు తనకు శిక్షణ ఇచ్చి, విజయాలు సాధించేందుకు దోహదపడిన శ్రీధరన్‌కు ఎన్‌వివిఎస్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.